సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 18 । నవంబర్ । 2023



ప్రతిభకు ప్రోత్సాహం

అత్యుత్తమ పనితీరు కనబరిచిన ముగ్గురు సివిల్, ఒక ఏఆర్ సిబ్బందికి ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ నగదు రివార్డు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. -8లో



మళ్లీ జగనన్న రావాలి

రాష్ట్రంలో పేద,ధనికుల మధ్యఅసమానతలు తొలగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.7/22.1

జిల్లాలో శుక్రవారం 22.1 - 33.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

22న ల్యాబ్ టీచర్లకు శిక్షణ

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు సంబంధించి ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న 16 ల్యాబ్‌ల ఇన్‌చార్జి టీచర్లకు ఈ నెల 22వ తేదీన ఒక్కరోజు శిక్షణ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం విజయవాడలోని సాయిజువెల్ కన్వెన్షన్ సెంటర్లో జరుగుతుందన్నారు. 16 ల్యాబ్‌ల ఇన్‌చార్జి టీచర్లు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. ఇది ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఆదేశమని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డిని 9441035830 ఫోన్ నంబర్లో సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

22న వెయిట్‌లిఫ్టింగ్ ఎంపికలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని వ్యాయామవిద్య, క్రీడాశాస్త్ర శాఖ ఆవరణంలో ఈనెల 22వ తేదీ వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే పురుషులు, మహిళల జట్టుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే వారు కళాశాల స్టడీ సర్టిఫికెట్, పది, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, జిరాక్స్ ప్రతులను తీసుకురావాలన్నారు. 17 నుంచి 25 సంవత్సరాలలోపు విద్యార్థులు ఎంపికలకు అర్హులన్నారు.

20న ధృవపత్రాల పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో జాతీయ అర్బన్ ఆరోగ్య పథకంలో ఏర్పడిన తొమ్మిది మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల జాబితాను హెచ్‌టీపీపీఎస్://కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం కడపలో ధృవపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీకి ఎంపిక



లక్ష్మీనరసింహను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం. లక్ష్మీనరసింహ ఢిల్లీలోని జాతీయ విద్యా, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ)లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సైకాలజీ అండ్ ఫౌండేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యాడు. సైకాలజీ విభాగాధిపతి డా. కె. లలిత, సహ ఆచార్యులు డా. వి. లాజరస్ ఆధ్వర్యంలో డా. లక్ష్మీనరసింహ మర్యాదపూర్వకంగా వీసీ, రిజిస్ట్రార్‌లను కలిశారు. వారు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి. రవి. అశ్వర్థరెడ్డి, టి. సురేష్‌బాబు పాల్గొన్నారు.

చిట్వేలిలో కబడ్డీ పోటీలు

చిట్వేలి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా వ్యవస్థాపక కార్యదర్శి పీడీ.డేవిడ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆది, సోమవారాల్లో మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి వసంత మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా క్రీడాకారులకు ప్రయాణ ఖర్చులు, క్రీడా దుస్తులు, ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కడప జోన్‌కు 400 బస్సులు

రాజంపేట: కడప ఆర్టీసీ జోన్‌కు వచ్చే ఏడాది మార్చి నాటికి 400 కొత్త బస్సులు రానున్నాయని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. రాజంపేట ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 200 కొత్త బస్సులు రోడ్డెక్కాయని తెలిపారు. గత ఏడాది ఆర్టీసీ రూ.330 కోట్ల నష్టాల్లో నడిచిందని, ఈ ఏడాది రూ.21 కోట్లు తగ్గించగలిగామన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమం నెలలో రెండు సార్లు నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రయాణికులతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టరు మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సంస్థను లాబాల బాటలో నడిపించేందుకు ఆర్టీసీ కార్గో సేవలు చేపట్టిందని తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల్లోని అన్ని డిపోల పరిధిలో మెరుగైన సేవలందించే విషయంలో మార్గదర్శకాలను తీసుకొస్తామన్నారు. అనంతరం డిపో సర్వీసులపై సమీక్షించారు. నాలుగు రూట్‌లలో గిఫ్ట్ స్కీం పెట్టాలని సూచించారు. బస్టాండు, కార్గో పాయింట్‌ను పరిశీలించారు. ఈడీని రాజంపేట డిపో కార్మికసంఘాల నేతలు కలిశారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ తరఫున నరసింహులు, ఎంప్లాయిస్ యూనియన్ తరఫున మౌలా తదితర నేతలు ఈడీని కలిసి సమస్యలను విన్నవించారు.

పాఠశాలల్లో పర్యవేక్షణ పక్కా

- ప్రభుత్వ, ప్రైవేటు బడుల నిర్వహణపై ఫోకస్
- ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలు
- పథకాల అమలుకు పటిష్ట చర్యలు



కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది సౌకర్యాలు కల్పించింది. అలాగే బోధన, పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులు తదితర విషయాలను నిరంతరం పర్యవేక్షించేలా సంస్కరణలను చేపట్టింది. దీంతోపాటు పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పూర్తిస్థాయిలో వసతుల కల్పనే లక్ష్యంగా ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించింది. వీరిలో ఒకరు పర్యవేక్షణ, మరొకరు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

జిల్లావ్యాప్తంగా 2849 పాఠశాలలు ఉన్నాయి. అందులో 2065 ప్రభుత్వం, 784 ప్రైవేట్ ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1,52,697 మంది, ప్రైవేటు బడుల్లో 1,83,530 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అధునాతనంగా తీర్చిదిద్ది కార్పొరేట్‌కు దీటుగా వసతులను కల్పించింది. ఇంగ్లీష్ మీడియం, ఐఎఫ్‌పీ ప్యానల్, డిజిటల్ విధానంలో బోధన, టోఫెల్ విధానంలో పరీక్షలు, సీబీఎస్‌ఈ సిలబస్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. వీటన్నింటి అమలు, పర్యవేక్షణ బాధ్యతలను ఎంఈఓలకు అప్పగించింది.



ట్యాబుల్లో పాఠాలను వింటున్న 8వ తరగతి విద్యార్థులు

మేనేజ్‌మెంట్	స్కూళ్లు	విద్యార్థులు
ప్రభుత్వ	2035	1,54,793
ఎయిడెడ్	53	6323
ప్రైవేటు	761	1,75,635
మొత్తం	2849	3,36,751



రంగురంగుల భవనాలతో కడప చెమ్ముమియాపేట బాలికల హైస్కూల్

- జిల్లాలోని 36 మండలాల పరిధిలో 36 మంది రెగ్యులర్ ఎంఈఓలు ఉండాల్సి ఉండగా 22 మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈఓ-1లు ఉండగా మిగతా 14 ఎఫ్ఏసీతో నడుస్తున్నాయి. వీటితోపాటు ఎంఈఓ-2 పోస్టుల్లో మాత్రం 36 మందిని భర్తీ చేశారు.

ఎంఈఓల విధులు..

- ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలను ప్రతి నిత్యం సందర్శించాలి. పాఠశాలలను నిశితంగా తనిఖీ చేయాలి. ఉపాధ్యాయులకు శిక్షణ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన కార్యక్రమాలు అమలయ్యేలా చూడాలి.
- పాఠశాలలకు అవసరమైన వాటిని అంచనా వేసే బాధ్యతను ఎంఈఓ-1 చేయాల్సి ఉంది.
- పాలనాపరంగా పాఠశాలల స్థాపన, గుర్తింపు ప్రక్రియ, వాటిని బలోపేతం చేయడం, ఉపాధ్యాయుల సర్వీస్‌కు సంబంధించిన అంశాలు, అధికారులు కేటాయించిన ఇతర విధులను సైతం పర్యవేక్షించాలి
- పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్, బడిబయట పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, ఒకేషనల్ ఎడ్యుకేషన్‌పై చర్యలు, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించిన అంశాలు, యూడైస్ నిర్వహణ లాంటి వాటిని ఎంఈఓ-2 పర్యవేక్షించాలి.
- పాఠశాలలకు వసతుల కల్పన, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పాఠ్యపుస్తకాల సరఫరా, మధ్యాహ్నభోజన పథకం అమలు, పారిశుధ్యం, ప్రభుత్వ పథకాల అమలు వంటి విధులు నిర్వర్తించాలి.

నియామక ప్రక్రియ పూర్తి



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మండలానికి ఇద్దరు ఎంఈఓల నియామకం చేపట్టాం. ప్రభుత్వ నిర్ణయంతో పాఠశాలపై మరింత నిఘా పెరుగుతుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. సదుపాయాలు మెరుగుపడతాయి. - ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

విద్యాభివృద్ధికి సీఎం కృషి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాఠశాల విద్యలో ఎన్నో సంస్కరణలు తెచ్చారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ బడులను రూపురేఖలు మార్చారు. పిల్లలందరూ చాలా సంతోషంగా ఉన్నారు. - మార్తాల వెంకటకృష్ణారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతోందని, కొత్తగా జిల్లాలో వేల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేస్తోందని జేసీ గణేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడు బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు భూముల కేటాయింపు పత్రాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ, డీఆర్వో, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కొత్తగా జిల్లాలో 1818 మంది పేదలకు 2683.65 ఎకరాల అసైన్డ్ భూములు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 138 గ్రామాల పరిధిలో దళితుల స్మశాన వాటికలకు 95.23 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయిస్తోందని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ గతంలో పంపిణీ చేసిన 1910.54 ఎకరాల భూములపై 1738 మందికి సర్వహక్కులు కల్పిస్తున్నామన్నారు. అలాగే రుణాలు మాఫీ చేశామని తెలిపారు. జిల్లాలో 49,701 మందికి రీ సర్వే పూర్తి చేశామన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్షలో కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, ఈమేరకు రబీ సీజన్ రైతులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ విజయరామరాజు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి.శివ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం జరిగింది. జేసీ గణేష్ కుమార్,అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని ఆయకట్టు పరిధిలో పంటల సాగుకు అందుబాటులో ఉన్న నీటి వనరులైన బోర్లు, బావులు తదితరాలను సద్వినియోగం చేసుకుని అందుకు అనువుగా పంట రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాల్సి ఉంటుందన్నారు. కడప నగరంలో రైతు బజార్లను పెంచాలన్నారు. అలాగే అగ్రికల్చర్ మార్కెటింగ్ గోడౌన్ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. జేసీ గణేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల పంటల సాగు విస్తీర్ణం దిగుబడులు పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఆ దిశగా వ్యవసాయ శాఖ డివిజన్ల వారీగా టార్గెట్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. రైతులు సాగు చేసేందుకు విరివిగా రుణాలు ఇప్పించేందుకు సహకరించాలని ఎల్‌డీఎంకు సూచించారు. జిల్లా అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బలరాం రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రరెడ్డి, సీఎంఎస్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) డీపీఎం రామకృష్ణ, ఆత్మ పీడీ విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి


జిల్లాలో ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, ప్రగతిలో వెనుకబడితే చర్యలు తప్పవని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్మిస్తున్న సచివాలయ భవనాలు, కేటగిరీ-2 క్రింద చేపట్టిన బీఎంసీయూలు, డిజిటల్ లైబ్రరీలు తదితర భవన నిర్మాణాల విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సచివాలయాల పరిధిలో చేపట్టిన నిర్మాణ పనులను పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేసిన పనులకు సంబంధించి బిల్లుల అప్ లోడ్ విషయంలో ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొలాల్లో.. ఎర్ర బంగారం

- శేషాచలం అడవుల్లో విస్తరించిన చెట్లు
- వైఎస్సార్ జిల్లాలో 3.2 మిలియన్ హెక్టార్లు
- సాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు
- ఆంక్షలు ఎత్తివేసిన కేంద్ర ప్రభుత్వం

నాడు

కేంద్ర ప్రభుత్వం 2004లో వాణిజ్య పరంగా విధించిన ప్రభుత్వ ఆంక్షలతో అడవిలో స్మగ్లింగ్, ఎగుమతుల కోసం పోరు.. తరలింపునకు కూలీల కష్టాలు, పోలీసుల నుంచి వారికి కలిగే నష్టాలు ఇప్పటి వరకూ కనిపించాయి. దేశ, విదేశాలలో విలువ పెరగడంతో అక్రమ రవాణాకు ఆజ్యం పడింది. స్మగ్లింగ్ చేసే వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు , ఫారెస్టు అధికారులు ఎంతోమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈ వ్యాపారంలో కొందరు కోట్లకు పడగలెత్తారు.




నేడు

ఈ నెల ఆరో తేదీ నుంచి స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సు (కన్వెన్షన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్డేంజర్ స్పీసీస్ ఆఫ్ ఫ్లోరా అండ్ ఫౌనా)లో ఎర్ర చందనంపై ఆంక్షలు తొలగించాలని వివిధ దేశాల ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఎర్ర చందనం సాగు, ఎగుమతులపై ఉన్న ఆంక్షలు తొలగిస్తున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్‌యాదవ్ ఈ మేరకు ప్రకటన చేశారు. సాగుచేయాలనుకున్న రైతులకు కేంద్రం ఊరట ఇచ్చింది.

రాజంపేట: కేంద్ర ప్రభుత్వం ఎర్రచందనంపై ఆంక్షలు ఎత్తి వేయడం రైతులకు ఊరట కలిగించింది. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో ఆరు మిలియన్ హెక్టార్లలో శేషాచలం అడవులు విస్తరించి ఉన్నాయి. విదేశాలకు తరలిపోకుండా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు 2015లో తిరుపతి హెడ్ క్వార్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం యాంటీ స్మగ్లర్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. అడవుల్లో నిత్యం కూంబింగ్ చేస్తూ ఈ చెట్లను నరకకుండా అడ్డుకుంటోంది. గత 15 ఏళ్లలో 15లక్షల టన్నుల ఎర్రబంగారం విదేశాలకు తరలిపోయింది. ఈ జిల్లాల్లో రైతులు గతంలో తమ పొలాల్లో ఎర్రచందనం మొక్కలు పెంచుకొనేందుకు ఆసక్తి చూపినా ఆంక్షలుండడంతో ఎగుమతులు కష్టమై వదిలేశారు. తాజాగా నిబంధనలు ఎత్తి వేయడంతో వారికి మార్గం సుగమమైంది. మూడు నెలల్లో మొక్కలు పెంచుకోవడానికి ప్రభుత్వం నిర్దేశించిన ధరతోనే రైతులకు అందజేస్తుంది. ఆసక్తి చూపే రైతులకు ప్రోత్సాహం అందించేందుకు సిద్ధమవుతోంది. ఎగుమతులు చేసుకునేందుకు అవకాశం ఉంటే తాము సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు.

శేషాచలం, వెలుగొండలోనే అధికం

ప్రపంచంలోనే అరుదైన ఎర్ర చందనం రాయలసీమ ప్రాంతం ఉన్న కొండల్లో మాత్రమే దొరుకుతుంది. ఈ కొండలు దాదాపు 5.5 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలో విస్తరించిన శేషాచలం, వెలుగొండ, పాలకొండ, లక్కమల, నల్లమల అడవులు తూర్పుకనుమల్లో ఉన్నాయి. వాటిలో ఎక్కువగా శేషాచలం. వెలుగొండలో మాత్రమే ఎర్రచందనం పెరుగుతోంది. శేషాచలం కొండల్లో పెరిగే ఎర్రచందనానికి ఎక్కువ చేవ ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. రాజంపేట ఎర్రచందనం నాణ్యతలో ప్రప్రథమం. ఇప్పటికే వైఎస్సార్‌జిల్లాలో 3.2 మిలియన్ల హెక్టార్లలో, అన్నమయ్య జిల్లాలో 2.8 మిలియన్ల హెక్టార్లలో ఎర్రచందనం మొక్కలు విస్తరించి ఉన్నాయి.



శేషాచలంలో విస్తారంగా పెరిగిన ఎర్రచందనం వృక్షాలు

ఎర్ర చందనం సాగుకు అనుమతి ఇచ్చింది



ఎర్ర చందనం సాగుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరలో ఎర్రచందనం చెట్లు పెంచుకోవడానికి మొక్కలను ప్రభుత్వం నిర్దేశించిన రేటులో రైతులకు అందజేస్తుంది. మూడు నెలల్లో ఎర్ర చందనం మొక్కలను అందజేస్తాం. కేంద్రం అనుమతి ఇవ్వడం వల్ల ఎర్రబంగారం పండించుకునే అవకాశం రైతులకు కలిగింది. ఎర్రచందనం సాగుపై ఆంక్షలు ఎత్తివేయడంతో స్మగ్లింగ్‌కు అవకాశం లేకుండాపోతుంది. - వివేక్, జిల్లా అటవీశాఖాధికారి, అన్నమయ్య

ఎర్రచందనం అనే పేరు ఎలా..



ఎర్రచందనాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. టెరోకార్పస్ సాంటలైనస్ అనేది దీని శాస్త్రీయ నామం. టెరో అనే గ్రీక్ మాటకు ఉడ్(కర్ర) అని అర్థం. కార్పస్ అంటే పండు. దాని కాయ చాలా గట్టిగా ఉంటుంది. సాధారణంగా అది మొలకెత్తదు. మొక్క రావాలంటే ఏడాది పడుతుంది. దీన్నే ఎర్రచందనం రక్తచందనం, శాంటాలం, ఎర్రబంగారం అని కూడా అంటారు. ఇది ప్యాబేసి వర్గానికి చెందిన మొక్క. దీని దుంగ ఎర్రగా ఉండటం వల్ల ఎర్రచందనం అంటారు.

ఇంత డిమాండ్ ఎందుకు..

చైనా, జపాన్‌లో వంటింట్లో వాడే పాత్రలు, గిన్నెలు కూడా ఎర్ర చందనంతో చేసినవి వాడుతుంటారు. సంగీత వాయిద్యాలు తయారుచేసి పెళ్లిళ్లలో బహుమతిగా ఇస్తారు. చైనా, జపాన్‌తో పాటు రష్యా వాళ్లు కూడా ఎర్రచందనాన్ని కొనుగోలు చేస్తుంటారు. అందులో ఔషధ గుణాలు ఉన్నాయి. వయగ్రా, కాస్మెటిక్, ఫేస్ క్రీమ్ లాంటి వాటిలో వీటిని వాడుతారు. అల్సర్‌ను తగ్గించే గుణం కిడ్నీ సమస్యలు, రక్తాన్ని శుద్ధి చేయడం వంటి లక్షణాలు ఎర్రచందనంలో ఉంటాయని నిపుణులు అంటున్నారు.

నవశకం

పేదల కల సాకారమవుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధిదారులలో ఆనందం వెల్లివిరుస్తోంది. గతంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా మంజూరవని పథకాలు నేడు ఇంటికే వచ్చి చేరుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పేదలందరికీ ఇళ్లు

సొంతింటి కల సాకారమైంది..



గతంలో టీడీపీ వర్గీయుడుగా ఉన్నప్పటికీ సొంత ఇళ్లు మంజూరు కాలేదు. వైఎస్సార్ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరైన పక్కా గృహాన్ని నిర్మించుకున్నా. ఇటీవల గృహ ప్రవేశం చేశా. తనకు భార్య లేదు. ముగ్గురు కుమారులు ఉన్నారు.సొంతింటి కల సాకారం చేసిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం. - పల్లె చిన్న చెన్నయ్య, పల్లవోలు,చాపాడు మండలం

నాడు- నేడు

అధునాతన వసతులతో బడి



గతంలో మా పాఠశాల చాలా అధ్వానంగా ఉండేది. నాడు- నేడు పథకం వల్ల పాఠశాల రూపురేఖలు మారాయి.ఇరుకు గదుల సమస్య తీరింది. అత్యాధునిక వసతులు సమకూరాయి. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు సంతోషంగా పాఠశాలకు వస్తున్నారు. - నరసారెడ్డి, ఉపాధ్యాయుడు, నగరపాలక ప్రాథమిక పాఠశాల, కడప

జగనన్న సురక్ష

ఉచితంగా ధృవీకరణ పత్రాలు



గతంలో ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాను.అయినా పత్రాలు రాలేదు. జగనన్న వచ్చాక ఆ పరిస్థితి లేదు. నా కుమార్తె వైష్ణవి నవోదయ, సైనిక్ పాఠశాలలకు దరఖాస్తు చేసింది. ఇందుకు అవసరమైన ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు. - కంకర పెద్ద మౌలాలిరెడ్డి, చిన్నవెంతుర్ల మైలవరం మండలం

క్లుప్తంగా

విలేకరిపై కేసు నమోదు

కలసపాడు : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన విలేకరి పసుపుల నాగేశ్వర్ రావుపై కేసు నమోదైనట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. ఈ నెల 12న దీపావళి సందర్భంగా కలసపాడుకు చెందిన అక్కిసునీత కలసపాడు శివారు ప్రాంతంలో టపాసుల లైసెన్స్ దుకాణం ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయిస్తోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఓ సంస్థ(సాక్షి కాదు) విలేకరి నాగేశ్వర్‌రావు దుకాణం వద్దకు వెళ్లి ఉచితంగా టపాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు. తనకు టపాసులు ఊరికే రాలేదని, ఉచితంగా ఇవ్వబోమని ఆమె తెలిపిందన్నారు. నీ లైసెన్స్‌ను రద్దు చేయిస్తానని బెదిరించి పరుష పదజాలంతో ఆమెను మాట్లాడాడని చెప్పారు. ఈ మేరకు ఈ నెల 13వ తేదీన ఎస్పీకి స్పందనలో సునీత ఫిర్యాదు చేసిందన్నారు. పరిశీలించి శుక్రవారం నాగేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపురం : మండలంలోని ఎర్రబల్లి వద్ద ఉన్న పాపాఘ్నినది నుంచి ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను మండల తహసీల్దార్ సరస్వతి పట్టుకుని కార్యాలయం వద్దకు తరలించారు. బిల్లులన్నీ సక్రమంగా ఉండటంతో వాటిని వదిలి వేసినట్లు తహసీల్దార్ తెలిపారు. అలాగే మరో 5 టిప్పర్లు ఎర్రమట్టి తరలిస్తుండగా ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటిని పరిశీలించి అన్ని అనుమతులు ఉంటే వదిలి వేస్తామని, లేని పక్షంలో కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించారని ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీ గుడిసివారిపల్లెకు చెందిన వినయ్‌కుమార్, ప్రేమకళ దంపతుల కుమారుడు సుశాంత్‌కుమార్(19) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పనులు ముగించుకుని మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు కుమారుడిని గట్టిగా మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సుశాంత్‌కుమార్ గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని కిందకు దించి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్సలు అందిస్తుండగానే, సుశాంత్‌కుమార్ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కుక్కరాజుపల్లెకు చెందిన గోపాల్‌రెడ్డి కుమారుడు శివరామరెడ్డి(50) పలువురి వద్ద అధికమొత్తంలో అప్పులు చేశాడు. ఇటీవల రుణదాతల ఒత్తిడి పెరగడంతో శుక్రవారం ఇంటివద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పోలీస్ శాఖలో ప్రతిభకు ప్రోత్సాహం

నలుగురికి అవార్డుల ప్రదానం



అవార్డును అందుకున్న పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఇటీవల జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అత్యుత్తమ పని తీరు కనబరిచిన వారికి 'వీక్లీ బెస్ట్ పెర్మార్మన్స్ అవార్డు'ను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ముగ్గురు సివిల్, ఒక ఏఆర్ సిబ్బందికి జిల్లా పోలీస్ కార్యాలయంలో నగదు రివార్డు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

- ప్రొద్దుటూరు టూటౌన్ పరిధిలో ఆరేళ్ల క్రిందట జరిగిన హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానాను ప్రొద్దుటూరు సెకండ్ ఏ.డి.జె కోర్టు విధించింది. ప్రొద్దుటూరు టూటౌన్‌లో కోర్టు ప్రాసెస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రామాంజనేయులు (పి.సి- 2812) సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశ పెట్టడంలో కీలకపాత్ర పోషించారు.
- కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా రాయపురం గ్రామానికి చెందిన ఓ మహిళను గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగించడంలో ముద్దనూరు పి.ఎస్.కానిస్టేబుల్ ఎన్.వాణి (డబ్ల్యూ పి.సి-3459) ఎంతో చొరవ చూపారు.
- హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేయడంలో బద్వేల్ పి.ఎస్. కానిస్టేబుల్ డి. నరసింహులు (పి.సి-3032) కీలకపాత్ర పోషించారు.
- ఏ.ఆర్. విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.నాగేశ్వరరావు(ఏ.ఆర్.హెచ్.సి-2454) జనరల్ డ్యూటీలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలాంటి విధులనైనా నిజాయితీ, క్రమశిక్షణతో నిర్వహిస్తూ ఉన్నతాధికారుల వద్ద గుర్తింపు పొందారు.
- వీరికి జిల్లా ఎస్పీ 'బెస్ట్ పెర్మార్మన్స్ అవార్డు'ను అందజేశారు. స్ఫూర్తిదాయకమైన సేవలు అందించి పోలీస్ శాఖ ఔన్నత్యాన్ని పెంపొందించారని, ముమ్ముందు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆకాంక్షించారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో 'పోలీస్ గ్రీవియన్స్‌డే' నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్, మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఆయన సావధానంగా విని వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

అసమానతలు తొలగాలంటే మళ్లీ జగనన్న రావాలి

- డిప్యూటీ సీఎం అంజద్ బాషా
- సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో పేద, ధనికుల మధ్య అసమానతలు తొలగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మైదుకూరు మండలం వనిపెంటలో గ్రామ సచివాలయం, మిట్టమానుపల్లెలో ఆర్‌బీకే, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాలను డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వనిపెంటలో నిర్వహించిన 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని, లేదంటే రాష్ట్రం మళ్లీ మొదటికి వస్తుందని అన్నారు. ప్రభుత్వం పెత్తందారుల చేతుల్లోకి వెళుతుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే సంగ్రామం లాంటిదని అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ పేదల పక్షాన ఉండగా, ప్రతిపక్షాలు పెత్తందారులకు మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారని అన్నారు. జగన్ వచ్చాకే సంక్షేమం, అభివృద్ధి జరుగుతున్నాయని అన్నారు. చంద్రబాబు పాలనను సీఎం వైఎస్ జగన్ పాలనను బేరీజు వేసుకోవాలని కోరారు. ఏ ప్రభుత్వం మంచి చేసింది, ఏ ప్రభుత్వం మీకు, మీ కుటుంబాలకు, మీ పిల్లలకు, మీ గ్రామానికి మేలు చేసిందో ఆ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని, ఆశీర్వదించాలని తెలిపారు. అనంతరం సచివాలయ ఆవరణలో ఇప్పటి వరకు నవరత్నాలు తదితర పథకాల ద్వారా ఎంత మందికి ఎంత లబ్ధి చేకూరింది తెలిపే బోర్డును వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, వక్ఫ్‌బోర్డు కమిటీ చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ శ్రీమన్నారాయణరెడ్డి, వనిపెంట సర్పంచ్ గౌస్ లాజం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కటారి వీరన్న, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఫ్జల్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న కోనయ్య

కడప కార్పొరేషన్ : తమ హక్కులను తెలుసుకోలేక నిర్లక్ష్యానికి గురౌతున్న పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలవాలన్నదే తమ లక్ష్యమని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కాసల కోనయ్య అన్నారు. స్థానిక అక్కాయపల్లెలోని ఓ ప్రయివేటు పాఠశాలలో శుక్రవారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మీడియా విభాగం చైర్మన్ రఘునాథ్ రెడ్డి, కడప జిల్లా చైర్మన్ కానగల సుబ్బరామయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కులు తెలుసుకొంటేనే ప్రగతి పథంలో పయనిస్తారని చెప్పారు. రాయలసీమ రీజనల్ అబ్జర్వర్‌గా పోతురాజు లోకేష్, పులివెందుల మీడియా చైర్మన్‌గా జీవన్‌రెడ్డిని ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక విభాగం చైర్మన్ టి.ఓబులేసు, రాయలసీమ మీడియా విభాగం చైర్మన్ జి.రాఘవ, రీజనల్ వైస్ చైర్మన్ ఎన్.సురేష్ బాబు, జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ జాకీర్ బాషా, జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ గౌస్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-17 కబడ్డీ టోర్నమెంట్, బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి సుమారు 240 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. ఇందులో బాలుర విభాగంలో రైల్వేకోడూరు జట్టు విన్నర్స్‌గా, పులివెందుల జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో జమ్మలమడుగు జట్టు విన్నర్స్‌గా, మైదుకూరు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. అనంతరం ప్రతిభ ఆధారంగా బాలుర విభాగంలో 18 మందిని, బాలికల విభాగంలో 18 మందిని ఎంపిక చేశారు. వీరికి ఆదివారం నుంచి కడప మున్సిపల్ స్టేడియంలో శిక్షణ ఇచ్చి ఉత్తమ ప్రతిభ చూపిన వారిలో బాలుర జట్టుకు 12 మందిని, బాలికల జట్టుకు 12 మందిని ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఈ నెల 24న చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కడప జిల్లా తరపున క్రీడాకారులు పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, ఆర్.వి.సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ బి.అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ నిత్యప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కిరణ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్.సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు డి.ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభిమానులకు 'ఫైనల్' పండుగ

కడప ఆర్ట్స్ కళాశాలలో భారీ స్క్రీన్ ఏర్పాటు



పోలీసు అధికారులతో చర్చిస్తున్న సీఏవైడీ అధ్యక్ష, కార్యదర్శులు

కడప స్పోర్ట్స్ : క్రికెట్ ప్రపంచకప్-2023లో భాగంగా ఫైనల్‌మ్యాచ్‌లో తలపడుతున్న భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌ను భారీ స్క్రీన్‌పై వీక్షించేందుకు కడప ప్రజలకు మరో సువర్ణ అవకాశం లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య నిర్వహించిన సెమీఫైనల్ మ్యాచ్‌ను కడప ప్రజలు వీక్షించేందుకు ఆర్ట్స్ కళాశాలలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి లైవ్ స్ట్రీమింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. లైవ్ స్ట్రీమింగ్‌కు ప్రజలు, క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించడం, భారత జట్టు ఫైనల్‌కు చేరడంతో ఫైనల్ మ్యాచ్‌ను క్రీడాభిమానులు, ప్రజల కోలాహలం మధ్య వీక్షించాలనుకునే వారికోసం క్రికెట్ సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి అందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఉచిత ప్రవేశం, ఫైనల్ మ్యాచ్ కావడంతో పెద్దసంఖ్యలో క్రీడాభిమానులు, యువత వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా క్రికెట్ సంఘం ప్రతినిధులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్యాలరీలు, బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు శుక్రవారం కడప నగర పోలీసులతో కలిసి వారు మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీఫైనల్ మ్యాచ్‌కు నిర్వహించిన లైవ్ స్ట్రీమింగ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఫైనల్ మ్యాచ్‌కు భారీసంఖ్యలో క్రీడాభిమానులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసుల సహకారంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు, క్రీడాభిమానులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఏవైడీ ప్రతినిధులు పి.సంజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంపు ప్రారంభం



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న ఎన్‌సీసీ కేడెట్స్

కడప స్పోర్ట్స్ : కడప నగరం తెలుగుగంగకాలనీ ఎన్‌సీసీ నగర్‌లో ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న ఎన్‌సీసీ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు-12 శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు క్యాంపులో భాగంగా కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వచ్చిన 600 మంది ఎన్‌సీసీ కేడెట్స్ వివరాలను రిజిస్టర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా మాట్లాడుతూ పదిరోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్, మ్యాప్‌రీడింగ్, నాయకత్వ లక్షణాలు, ఫీల్డ్‌క్రాఫ్ట, బాటిల్ క్రాఫ్ట్, ఫైరింగ్, ఆయుధ శిక్షణ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ ఆర్.నీలయ్య, మహేష్, పరేడ్ శిక్షకులు అశోక్, గోపాల్‌రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ సరస్వతి, సిబ్బంది డేవిడ్, ఉమ, ప్రియ, రాజగోపాల్‌రెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. పుష్పగిరి, కన్యతీర్థం, అల్లాడుపల్లె దేవలాలు, యాగంటి, మహానంది క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. కడప ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి కార్తీక సోమవారం ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరి తిరిగి రాత్రి 10కి కడపకు చేరుతుందన్నారు. ఈ బస్సులు ఈ నెల 20, 27, డిసెంబరు 4, 11 తేదీలలో రాకపోకలు సాగిస్తాయన్నారు. అలాగే ప్రతి సోమవారం ఉదయం 8 గంటలకు పొలతల, నిత్యపూజకోనలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. కార్తీక మాసంలో శ్రీశైలంకు ఆదివారం రాత్రి 10కి బస్సు బయలుదేరి సోమవారం ఉదయం 6కి శ్రీశైలం చేరుతుందన్నారు. ఈనెల 19, 26, డిసెంబరు 3, 10 తేదీలలో బస్సులు వెళతాయన్నారు. శబరిమలైకు వెళ్లే వారికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. బ్యాచ్‌ల వారీగా గానీ లేక స్పెషల్ హయ్యర్‌గా వచ్చిన వారికి అద్దెకు ఇస్తామన్నారు. ఇందులో ఒక గురుస్వామి, ఇద్దరు వంటమాస్టర్లకు ఉచితంగా అనుమతి ఇవ్వనున్నామన్నారు. ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం గల డ్రైవర్లతో ఈ బస్సులు నడపనున్నామన్నారు. ఇతర వివరాలకు డీఎం 9959225774, ఏడీసీ 9440449559, అసిస్టెంట్ మేనేజర్ 9959222049 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బైక్‌ల చోరీ కేసులో రెండేళ్ల జైలు

మదనపల్లె : ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులకు కింది కోర్టు విధించిన రెండేళ్ల జైలుశిక్షను పైకోర్టు ఖరారు చేసింది. మదనపల్లె రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022 జూన్ 12న ద్విచక్రవాహనాల చోరీపై కేసు నమోదైంది. ఈ కేసుతో పాటు పలు కేసుల్లో బైక్ చోరీలకు పాల్పడిన నిందితులు కర్ణాటక కోలార్ జిల్లా బంగారుపేటకు చెందిన సత్యప్ప కుమారుడు జాగి బంగారప్ప(25), కోలార్ టౌన్ వాసంత కుమారుడు ఫైరోజ్(25)లను 2022 ఆగస్టు 8న టూటౌన్ సీఐ మురళీకృష్ణ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై మదనపల్లె ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో న్యాయమూర్తి నిందితులకు రెండేళ్ల జైలుశిక్ష విధించారు. ఈ శిక్షపై నిందితులు పైకోర్టు అయిన అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేసిన ఏడీజే అబ్రహం కింది కోర్టు విధించిన రెండేళ్ల శిక్షను ఖరారు చేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు.

ఔషధరంగంలో విస్తృత పరిశోధనలు జరగాలి

రాజంపేట : ఔషధరంగంలో పెనుమార్పులు వస్తున్నాయని, వాటికి తగ్గట్టుగా పరిశోధనలు విస్తృతం కావాలని కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్, అనంతపురం జేఎన్‌టీయూఏ ప్రొఫెసర్ కేబీ చంద్రశేఖర్ అన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల (ఏఐటీఎస్)లో రెండు రోజుల పాటు జరిగే బయోఫార్మా సంవాద్-2023 జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఫార్మసీ పాత్ర కీలకంగా మారిందన్నారు. జాతీయ స్థాయిలో సదస్సుల లాంటి ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతుల ప్రదర్శనలు, బోధనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఏపీటీఐ(ఫార్మాటీచర్స్) స్టేట్ బ్రాంచి అధ్యక్షుడు కె.వెంకటరమణ, పాండిచ్చేరి మదర్ థెరిస్సా కళాశాల, పరిశోధన కేంద్రం ప్రొఫెసర్ వి.గోపాల్ మాట్లాడుతూ ఔషధ మొక్కలు మానవాళికి జీవనాన్ని ఇస్తున్నాయన్నారు. సదస్సులో ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, వైవీయూ జువాలజి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎన్వీ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత, వివిధ రాష్ట్రాల నుంచి ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై ఎస్‌ఈబీ దాడులు

మదనపల్లె : నిమ్మనపల్లె మండలం పారేసువారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న స్థావరంపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో 12 మంది తయారీదారులను అరెస్ట్ చేయడంతోపాటు 3,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. పారేసువారిపల్లెలో పెద్ద మొత్తంలో నాటుసారా తయారీ, అమ్మకాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు జరిపామన్నారు. అందులో గ్రామానికి చెందిన పారేశి గంగాధర్(35), పారేశి మణికంఠ(28), టేకుమంద నరసింహులు(39), పారేశి శివమూర్తి(37), బొంగ మనోహర్(45), పారేశి శ్రీనివాసులు(55), పారేశి రెడ్డెప్ప(36), పారేశి నరసింహులు(43), పుల్రా సురేంద్ర(37), పారేశి వెంకటరమణ(60), బొంగా మల్లికార్జున(45), రామన్న(45)లు నాటుసారా తయారీలో ప్రధాన నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. వీరితో పాటు అక్రమ నాటుసారా తయారీ వ్యవహారంలో పాత్రధారులైన అదే గ్రామానికి చెందిన మరికొందరిపైనా, అదేవిధంగా అక్రమ నాటుసారా తయారీకి కావాల్సిన ముడిసరుకు నల్లబెల్లం సరఫరాదారునిపైనా కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఎస్‌ఈబీ దాడుల్లో బీఎంపీపీ ఎస్ఐ పి.రాజశేఖర్, డీటీఎఫ్ ఎస్ఐ రాయచోటి హేమకుమార్, సిబ్బంది హరికుమార్, మునిరామయ్య, చంద్రశేఖర్, దామోదర్, ప్రసన్నకుమార్, లవకుమార్, బాలకృష్ణ, రేఖారాణి, సునీల్, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీ మోడల్‌స్కూల్‌లతోపాటు ప్రైవేటు, ఎయిడెడ్, కస్తూరిబా, ట్రైబల్‌వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ ఉన్నత పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేయాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరి చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దీశ ఓలకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లలో చేరిన విద్యార్థులకు రెండేళ్లు శిక్షణ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని వివరించారు. ఈ సర్టిఫికెట్లు గల విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ డేవిడ్, ట్రైనింగ్ ఇన్‌చార్జి రెడ్డెయ్య, ఎంఈఓలు బాలాజీ, ఆంజనేయులు నాయుడు, రిసోర్స్‌పర్సన్‌లు మధుర వాణి, ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, మాస్టర్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విష్ణువర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్

కమలాపురం : మండలంలోని నల్లలింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ భారతి స్కూల్‌కు చెందిన బి.విష్ణువర్ధన్‌రెడ్డి అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్. కిషోర్ కుమార్ తెలిపారు. ఈ నెల 16వ తేదీన కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 బాలుర విభాగంలో 400 మీటర్ల హార్డిల్స్ రన్నింగ్ పోటీల్లో పదవ తరగతి చదువుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి ప్రతిభ చూపి విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కాగా శుక్రవారం స్కూల్‌లో ప్రిన్సిపల్ విజేతతో పాటు పీఈటీ చందును అభినందించారు. స్టేట్, నేషనల్ పోటీల్లో సైతం ప్రతిభ కనబరిచి రాణించాలని సూచించారు.

రచయితల సభల్లో భాగస్వామ్యానికి అవకాశం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం డిసెంబరు 23, 24 తేదీలలో కడప నగరంలో మహాసభలను నిర్వహిస్తున్నామని, ఇందులో పలు అంశాలలో భాగస్వామ్యం పొందేందుకు పలువురు రచయితలు, కవులు, సాహిత్యాభిలాషులు, కార్యకర్తలకు అవకాశం కల్పిస్తున్నామని రచతయిల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహాసభల్లో రెండు రోజుల పాటు సాహిత్య ప్రసంగాలు, పత్ర సమర్పణలు, పలు రకాల సాహిత్య ప్రక్రియల ప్రదర్శనలు, పుస్తక ప్రదర్శనలు, సావనీర్‌లు, జిల్లా రచయితల పుస్తకాల ప్రదర్శన అమ్మకాలు, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాకు చెందిన రచయితలు తాము రాసిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచేందుకు సంఘ అధ్యక్షులను కనీసం 20 రోజుల ముందు సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఇంతకు ముందు నిర్వహించిన జిల్లా రచయితలు, అభ్యుదయ రచయితల సంఘాల మహాసభలకు సంబంధించిన సావనీర్‌లు కరపత్రాలు, కవుల రచయితల ప్రసంగ పాఠాలు, ఫోటోలు ఉంటే తమకు తెలపాలని వాటిని ప్రదర్శనలో ఉంచేందుకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రదర్శనకు యోగ్యమైన ఏ ఇతర సామాగ్రి తమ వద్ద ఉన్నా ఆ విషయం తమకు తెలపాలన్నారు. మరిన్ని వివరాలకు అధ్యక్షులు మూల మల్లికార్జున రెడ్డి 7700003399, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం 9704651414 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం



మృతి చెందిన వెంకటసుబ్బమ్మ

బద్వేలు అర్బన్ : బద్వేలు - మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని చెన్నంపల్లెకు చెందిన వల్లెపు వెంకటసుబ్బమ్మ (39) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఈమె భర్త సుబ్బరాయుడు 9 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఈమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఓ పని నిమిత్తం బద్వేలుకు వచ్చేందుకు చెన్నంపల్లె సమీపంలో ఆటో కోసం రోడ్డు పక్కన వేచి ఉండగా.. బద్వేలు నుంచి మైదుకూరు వైపు వేగంగా వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో వెంకటసుబ్బమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. 9 ఏళ్ల క్రితం తండ్రి, ప్రస్తుతం తల్లి మృతి చెందడంతో పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి సోదరుడు వెంకటసుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరాజు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు.